క్లుప్తంగా

ప్రత్యేక పూజలు, హోమం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్‌లో శ్రీరామ భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. చైతన్యనగర్ బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీరామ భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 14న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి చైతన్యనగర్‌లో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం, సాయంత్రం వేళల్లో యాగశాలలో సామూహిక పూజలు చేశారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు, అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

జనసేన నగర కమిటీ ఏర్పాటు

ఖమ్మం మామిళ్లగూడెం: జనసేన ఖమ్మం నగర కమిటీని శుక్రవారం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ మిరియాల నాగరాజు ఒక ప్రకటనలో వెల్లడించారు. అధ్యక్షుడిగా మెడబోయిన కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా అజయ్‌కృష్ణ, కార్యదర్శులుగా పుల్లారావు, పవన్‌కల్యాణ్, ఉపాధ్యక్షులుగా దేవేందర్, షేక్ మాలిక్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఉత్తమ రాజు, సత్యనారాయణ, శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రమణకుమార్, మహాలక్ష్మి, దుర్గాప్రసాద్, నరేష్, ఉపేందర్, శ్రీనివాసరావు, విజయకుమారి, నరసింహారావు, శ్రీకాంత్ నియమితులైనట్లు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న నర్సులు

నేలకొండపల్లి: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా స్థానిక సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద శుక్రవారం కేక్ కట్ చేసి పలువురు నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కె.రాజేష్ మాట్లాడుతూ.. నర్సులు అంకిత భావంతో పని చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్.శ్రావణ్‌కుమార్, స్టాఫ్ నర్సులు మానస, అంటోనమ్మ, అనురాధ, లావణ్య, ఏఎన్‌ఎంలతో పాటు చంద్రశేఖర్, వీరన్న, ఈగ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కందాల పరామర్శ

కూసుమంచి: మండల పరిధిలోని జీళ్లచెరువు వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధర్మాతండాకు చెందిన జర్పుల సింధూను శుక్రవారం పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కలిసి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇదే ప్రమాదంలో సింధూ సోదరుడు సందీప్ మృతిచెందగా గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఓ పక్క కుమారుడు మృతిచెందడం, మరో పక్క కుమార్తె తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, సందీప్ అంత్యక్రియల్లో పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	విరూపాక్ష
సాయిరాం	రామబాణం
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	కేరళ స్టోరీ
సుందర్	కథ వెనుక కథ

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	50		10
కాకర	46	చుక్కకూర	2
సొరకాయ	16		10
బీర	46	తోటకూర	2
దొండ	24		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		15
చామగడ్డ	36	పుదీన	1
క్యారెట్	46		15
క్యాప్సికం	50	-ఖమ్మం వ్యవసాయం	

కొనరు.. అమ్మనీయరు!

తెరుచుకోని అల్లీపురం-పుట్టకోట కొనుగోలు కేంద్రం

- పంట తీసుకురావాలని హడావుడి
- గాలి, వానకు ఆగమాగం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

కొనుగోలు కేంద్రం పెడుతున్నాం.. కేంద్రానికి మొక్కజొన్న పంటను తీసుకురాండి అని నిర్వాహకులు చెప్పారు. ఈనేపథ్యంలో డబ్బులు ఖర్చు చేసి మరీ కేంద్రానికి తీసుకొస్తే కేంద్రం తెరవ లేదు. దీంతో అకాల వర్షాలు, గాలి దుమారాలకు ఆరుగాలం కష్టపడి, పెట్టుబడులు పెట్టి పండించిన పంటంతా ఆగమాగం చేస్తున్నారు. కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కొనుగోలు కేంద్రంలో మక్కలు ఆరబెడుతున్న రైతు, (ఇన్‌సెట్) బస్తాల్లో నింపి ఎదురుచూస్తూ ఇలా..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 15వ డివిజన్‌లో అల్లీపురం-పుట్టకోట రోడ్డులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని చెప్పి నిర్వాహకులు పంటను తోలమని హడావుడి చేశారు. ఈ నేపథ్యంలో రూ.4వేలు, రూ.5 వేలు ఖర్చు చేసి పొలం వద్ద నుంచి కేంద్రానికి చేర్చారు. కానీ రేపు మాపు అంటూ కాలం వెల్లదీస్తూ తమను కల్లంలోనే పడుకోబెడుతున్నారని రైతులు వాపోతున్నారు.

పంటంతా ఆగమాగం..

కేంద్రం తెరవకపోవడంతో అకాల వర్షం, గాలి దుమారానికి పండిన పంట తడిచి ముక్క పడుతున్నాయి. బయట వ్యాపారులకు అమ్ముదామంటే మేము మద్దతు ధరలకు కొంటామని నిర్వాహకులు చెప్పడంతో పంటను అమ్మలేదు. కాని ఇప్పటివరకు కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు 'వీరు కొనరు.. అమ్మనీయరు'అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం వచ్చిన వాన, గాలితో తమ పంటంతా ఆగమాగం అయిందని వాపో యారు. బయటకు అమ్మిన ఒక రైతు బస్తాల్లోని పంట కూడా తడిపోయింది. తీసుకెళ్లడానికి ఎవరూ రావడం లేదని, ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలు తమ పాలిటశాపంగ మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పడిగాపులు కాస్తున్నాం..



గత కొన్ని రోజులుగా కేంద్రానికి మొక్కజొన్న పంటను తీసుకొచ్చా. కాంటాలు వేయకుండా ప్రారంభిస్తామంటూ కాలయాపన చేస్తున్నారు. పట్టాలు కప్పినా గాలి దుమారానికి పంటంతా తడిసింది. ఇప్పటికైనా జాప్యం వీడి కాంటాలు వేయించాలి.

– తాళ్లూరి చిరంజీవి, రైతు

బస్తాల్లో నింపినా ఇబ్బందే..



పండించిన పంటను కేంద్రానికి చేర్చాను. కొనడంలో జాప్యం చేయడంతో బయట వాళ్లకు అమ్మాను. కానీ కొన్నవారు ఇంతవరకు తీసుకుపోలేదు. వాన వల్ల బస్తాల్లో నింపినా.. ఇబ్బంది తప్పలేదు. గాలితో పట్టాలు ఎగిరి నానా అవస్థలు పడ్డాం.

– ముప్పారపు శ్రీను, రైతు

రైల్వే లైన్ అలైన్‌మెంట్ మార్చాలి


వినతి పత్రం అందిస్తున్న బోదులబండ రైతులు

నేలకొండపల్లి: మిర్యాలగూడెం-డోర్నకల్ రైల్వే లైన్ అలైన్‌మెంట్ మార్చేందుకు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను రైతులు కోరారు. మండలంలోని బోదులబండలో జరిగిన సీపీఎం సమావేశంలో పాల్గొన్న ఆయనకు రైతులు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ పూర్వ వైభవానికి కార్యకర్తలు కృషి చేయాలని తెలిపి బీజేపీ తీరుపై మండిపడ్డారు. అనంతరం బోదులబండ రైతులు తమ్మినేని కలిసి వినతి పత్రం అందించారు. రైల్వే లైన్ వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని, లైన్‌ను మార్చేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పాలేరు ఇన్‌చార్జ్ బండి రమేష్, మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, రచ్చా నరసింహారావు, కట్టికోల వెంకన్న సత్యనారాయణ, ఏటుకూరి రామారావు, పి.నాగేశ్వరరావు, చింతలపాటి భాస్కర్, సీతారాములు, చలపతి, వీరభద్రం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవా పతకాల గ్రహీతలకు సీపీ అభినందనలు


పతకాల గ్రహీతలతో సీపీ

ఖమ్మంక్రైం: అత్యుత్తమ సేవలకు గాను రాష్ట్ర హోంమంత్రి అలీ చేతుల మీదుగా సేవా పతాకలు అందుకున్న ట్రాఫిక్ పోలీసులను సీపీ విష్ణు ఎస్‌వారియర్ ప్రత్యేకంగా అభినందించారు. సేవా పతకాలు అందుకున్న వారిలో ట్రాఫిక్ సీఐ అంజలి, ఎస్ఐ వెంకటాచారి, భీమ్‌సింగ్, కోటేశ్వరరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ రామోజీ రమేష్ ఉన్నారు.

అశ్రితకు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు..


అశ్రితను సత్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన నగరానికి చెందిన రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు సరస్వతి భట్ల శ్రీధర్‌శర్మ, భవానీ దంపతుల కుమార్తె అశ్రితను బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు శుక్రవారం సత్కరించారు. బ్రాహ్మణ రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి, సిద్ధాంతి నాగేశ్వర, కోశాధికారి విజయ సారథి, ముఖ్య సలహాదారు హనుమంతాచారి, రామారావు దేశ్‌పాండేలతో పాటు సీతారామశాస్త్రి, జగన్నాథశర్మ, ప్రసాద్ శర్మ, కృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సుడా చైర్మన్‌కు సన్మానం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని జమ్మిబండబజార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్పీడ్ ఫోర్స్ సర్వీస్‌ను సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌తో పాటు బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్‌లు కన్నం వైష్ణవిప్రసన్నకృష్ణ, దాడే అమృత సతీష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాజమాన్యం సుడా చైర్మన్‌ను ఘనంగా సత్కరించింది. నిర్వాహకులు నెల్లూరి బేబీ నరేష్, మనోజ్, మేనేజర్ నిరన్‌జోషితో పాటు ఉదయరాజు, అజయ్ ఠాగూర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె

ఖమ్మం సహకారనగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న సమ్మె శుక్రవారం 15వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట దీక్ష శిబిరాన్ని వివిధ పార్టీల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, జనసేన నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ.. జేపీఎస్‌ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, కార్తీక్, దేవేందర్, మాలిక్, స్రవంతి, కన్నా, విజయకుమారి, రమణకుమార్, పుల్లారావు, ఉపేందర్, గంగాధర్, నగేష్ పాల్గొన్నారు.

డీసీసీబీ డైరెక్టర్ పదవి భర్తీ చేయాలి

ఖమ్మంవ్యవసాయం: డీసీసీబీలో గ్రూప్ 'బీ'వి భాగంలో ఖాళీగా ఉన్న ఎస్టీ రిజర్వ్‌డ్ డైరెక్టర్ పదవి భర్తీ చేయాలని కారేపల్లి మండలం మాణిక్యారం ట్రైబల్ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ధరావత్ బద్దూలాల్ కోరారు. ఈమేరకు ఆయన శుక్రవారం రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్‌కు దరఖాస్తు చేశారు. డీసీసీబీలోని పలు డైరెక్టర్ పదవులను భర్తీ చేసినా, ఎస్టీకి కేటాయించబడిన పదవి ఖాళీగా ఉందని తెలిపారు. ఈ విషయంపై సీఈఓ అట్లూరి వీరబాబును సంప్రదించగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే, పాలకవర్గం తీర్మానం మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

శ్మశానవాటికకు దారి కల్పించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ గ్రామంలో శ్మశానవాటికకు దారి కల్పించాలని రూరల్ తహసీల్దార్ టి.సుమకు గ్రామప్రజలు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల శ్రీనివాస్, బి.ప్రభాకర్, ఎర్ర ఉపేందర్, ఎన్.లింగయ్య, పి.భరత్, భద్రయ్య, చారి తదితరులు పాల్గొన్నారు.

గాలిదుమారంతో ఆగమాగం


చెల్లాచెదురైన నిరుపేదల నివాసాలు

ఖమ్మంఅర్బన్: గాలిదుమారం పలువురి ఆవాసాలను ఆగం చేసింది. జిల్లాలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పలువురి ఇళ్ల పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి. నగరంలోని కొత్తగూడెంలో బుడిగెం శ్రీనివాసరావు, నారపోగు కృష్ణ, కర్రి లక్ష్మణ్, భూమా జానీ తదితరల ఇళ్లపై రేకులు ఎగిరిపోగా, కొందరి ఇళ్ల పైకప్పులు ధ్వంసం కాగా రాత్రంతా అలాగే గడిపారు. ప్రభుత్వం తరఫున బాధితులను ఆదుకోవాలని సీపీఐ నాయకుడు పగడాల మల్లేష్ తదితరులు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నేలకొండపల్లి/కూసుమంచి: నేలకొండపల్లి పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత ఉండడం చేత శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూసుమంచి మండల కేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా శనివారం కూసుమంచి టౌన్ ఫీడర్‌తో పాటు ధర్మాతండా, వాటర్‌గ్రిడ్, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్, తురకగూడెం ఫీడర్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ గ్రేస్ సృజన పేర్కొన్నారు. అలాగే కావునా పట్టణ ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

మాజీ ఎంపీ విస్తృత పర్యటన


తడిసిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న పొంగులేటి

నేలకొండపల్లి/రఘునాథపాలెం: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలాల్లో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. నేలకొండపల్లి మండలంలోని ముజ్జుగూడెంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి ఆర్థిక సాయమందించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. నేలకొండపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు మన్నె కృష్ణారావు కుమారుడు వివాహం వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే రఘునాథపాలెం మండలం గణేశ్వరంలో తడిసిన ధాన్యం, మొక్కజొన్న పంటలను పరిశీలించి ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నేలకొండపల్లి మండలం పర్యటనలో డీసీసీబీ డైరెక్టర్ తుల్లూరి బ్రహ్మయ్య, మాజీ ఎంపీటీసీ చిలకల సీతారావమ్మ, మండల నాయకులు కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, చెరువు స్వర్ణ, చిదుముల జానరెడ్డి, ఉండమోదుగుల వెంకటేశ్వర్లు, వంగవీటి రవి, మూడు నాగరాజు తదితరులు పాల్గొనగా.. రఘునాథపాలెంలోని గణేశ్వరంలో నాయకులు తుల్లూరి బ్రహ్మయ్య,రామ్మూర్తినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పంట నష్టపరిహారం


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ అరుణ

నేలకొండపల్లి: అర్హులైన ప్రతీ రైతుకు పంట నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.అరుణ తెలిపారు. స్థానిక ఏఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగాక్లస్టర్ల వారిగా పంటలు సాగు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఇతరత్రా అంశాలపై చర్చించి ఏఈఓలకు పలు సూచనలు చేశారు. అంతేకాక మండలంలో నష్టపోయిన పంటలకు పరిహారం నివేదికను జిల్లా అధికారులకు అందించినట్లు తెలిపారు. ఎరువుల దుకాణాల వద్ద అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉంటూ తగు సూచనలు, సలహాలు అందించేందుకు వీలుగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఏఈఓలు పాల్గొన్నారు.

సిల్ట్ తొలగింపు పనులు ప్రారంభం


పిచ్చి మొక్కలు, సిల్ట్‌ను తొలగిస్తున్న జేసీబీ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 41వ డివిజన్‌లో మురుగు, వర్షం నీరు పారే కాల్వలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించే పనులను శుక్రవారం ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ కర్నాటి కృష్ణ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది ముందస్తుగా సిల్ట్‌ను తొలగించడం ద్వారా వరద నివారణ చర్యలు చేపట్టగలిగామని దానిలో భాగంగానే ఈ ఏడాది కూడా వర్షాకాలానికి ముందుగానే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ డీఈ స్వరూపరాణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సతీష్, స్థానికులు సామినేని వెంకటయ్య, తాతా రాఘవయ్య, ఎడ్లపల్లి దామోదర్, శివకుమార్, డివిజన్ నాయకులు సాయిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూలి రేట్లపై సహనం కోల్పోవద్దు


మాట్లాడుతున్న నకిరికంటి సంజీవరావు

ఖమ్మం మామిళ్లగూడెం: సుతారి కూలి రేట్లపై సహనం కోల్పోవద్దని మహాజన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నకిరికంటి సంజీవరావు కోరారు. శుక్రవారం ఇల్లెందు క్రాస్‌రోడ్‌లోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 6 నుంచి నగరంలో సుతారి కూలి రేట్లు పెంచాలని కోరుతూ సమ్మె నిర్వహిస్తున్న తరుణంలో కొందరు బిల్డర్లు పాత కూలి రేట్లు అని ప్రచారం చేస్తూ కార్మికులను రెచ్చగొట్టడం సరికాదన్నారు. నగర అధ్యక్షుడు తాడికొండ వీరేశం మాట్లాడుతూ.. ఈ నెల 15న ఖమ్మంలో జరగనున్న అన్ని భవన నిర్మాణరంగ కార్మిక సంఘాల మేస్త్రీల సమావేశంలో కూలి రేట్లపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బండి రవి, రాంబాబు, సీతారాములు, రామకృష్ణ, నాగేశ్వరావు, అశోక్, బుడేమియా, వెంకన్న, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి మండలస్థాయి క్రీడాపోటీలు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంస్పోర్ట్స్/తిరుమలాయపాలెం: సీఎం కప్-2023 నిర్వహణలో భాగంగా మండల స్థాయిలో నిర్వహించే క్రీడలను విజయవంతం చేయాలని తిరుమలాయపాలెం ఎంపీపీ బోడ మంగీలాల్, డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి కోరారు. ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలకు 15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల మధ్య వయస్సు గలవారు అర్హులని, ఇందులో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ వంటి పోటీలను నిర్వహించబడతాయన్నారు. ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరిగే ఈ పోటీల్లో పాల్గొనే వారు ఉదయం 10 కల్లా పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9848355350 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ కాలేజ్ ఆవరణలో నిర్వహించే క్రీడలకు పంచాయతీ కార్యాలయంలో 14వ తేదీ సాయంత్రంలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నిబంధనలు పాటించాలి

నేలకొండపల్లి: ఆటో డ్రైవర్లు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నేలకొండపల్లి ఎస్సై జి.స్రవంతి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆటో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలతో పాటు పోలీసులు అందించే గుర్తింపు కార్డులను ప్రతి ఒక్కరూ వెంట ఉంచుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ఈ సదస్సులో హెడ్ కానిస్టేబుళ్లు సీతారాములు, లక్ష్మి, కానిస్టేబుళ్లు ముడుసు రామకృష్ణ, చరణ్, హోంగార్డు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు వినతి

రఘునాథపాలెం: ఉపాధి కూలీలకు రోజు కూలీ రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్ర శ్రీను అన్నారు. శుక్రవారం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుడిదంపాడులో వ్యవసాయ కార్మిక సంఘం రఘునాథపాలెం మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.పని ప్రదేశంలో టెంట్లు, పారలు, గడ్డపారలు, బొచ్చలు కల్పించడంతో పాటు 200 పని దినాలు కల్పించేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కూలీలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని ఉపాధి కూలీలను కోరారు. అనంతరం గ్రామ సర్పంచ్ మీరాకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు.

పార్కింగ్ చేస్తే తాళం!


ద్విచక్ర వాహనాలకు వేసిన తాళాలు

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద నో పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలుపుతున్న వారిపై రైల్వే పోలీసులు చర్యలకు సిద్ధమయ్యారు. నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటుచేసినా కొందరు వాహనాలను నిలుపుతుండడంతో రద్దీ సమయాన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అక్కడ వాహనాలకు పోలీసులు తాళం వేస్తున్నారు. మొదటిసారి అలా పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, రెండోసారి రూ.500 జరిమానా విధిస్తున్నారు.

అటెన్షన్ ప్లీజ్

అందమైన రోడ్డులో అవస్థలు..!



కోట్లాది రూపాయలతో అందమైన రోడ్డు, డివైడర్ నిర్మాణం చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇటీవలే అభివృద్ధికి నోచుకొని రికార్డుల్లోకెక్కిన గ్రామ పంచాయతీ మండలంలోని వీవీపాలెం. కానీ, వీవీపాలెంలో రోడ్డు నిర్మాణ సమయంలో రైతు వేదిక ఎదురుగా సీసీ రోడ్డు పల్లంగా వేయడంతో ఏ చిన్నపాటి వర్షం వచ్చినా ఇదిగో ఇలా నీరు నిలిచి వారం, పది రోజులు దాక సమస్యగా మారుతుంది. ఈక్రమంలో నీటిని తప్పించబోయి వాహనదారులు పక్కకు వెళ్లడం, రోడ్డుకు ఎదురుగా రాకపోకలు సాగించడం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అందమైన రోడ్డులో ఒక మచ్చగా కనిపిస్తున్న చిన్నపాటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- రఘునాథపాలెం